సాక్షి
నల్లగొండ
గురువారం । 24 । ఆగస్టు । 2023



'రియల్' పేరిట ఘరానా మోసం !
రియల్ ఎస్టేట్ పేరిట ఘరానా మోసానికి పాల్పడిన ఓ ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో



నిబంధనలకు తిలోదకాలు
యాదాద్రిలో ఆలయ నిబంధనలకు అధికారులే తిలోదకాలు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. - 12లో



మా వాటా మాకు ఇవ్వండి
అన్ని పార్టీలు మా వాటా మాకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. - 12లో

న్యూస్‌రీల్

బీజేపీ త్రిపురారం మండల అధ్యక్షుడిపై సస్పెన్షన్ వేటు

నల్లగొండ టూటౌన్: బీజేపీ త్రిపురారం మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదగిరిగౌడ్‌ను పార్టీ నుంచి సస్పెన్షన్ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు స్థానిక నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు.

దోనిపాముల సర్పంచ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

చండూరు: మండల పరిధిలోని దోనిపాముల గ్రామ సర్పంచ్ తిప్పర్తి దేవేందర్‌పై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నేటి నుంచి ఆయన తిరిగి సర్పంచ్‌గా కొనసాగనున్నారు. గత నెలలో గ్రామంలోని బృహత్ పల్లె ప్రకృతి వనంలో చెట్లను తొలగించి తన వ్యవసాయ భూమిలోకి దారి చేశాడని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అప్పటి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి నివేదిక సమర్పించారు. నివేదిక ఆధారంగా సర్పంచ్‌పై కలెక్టర్ సస్పెన్షన్ విధించిన విషయం విదితమే.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



నల్లగొండలో పింఛన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని వీటీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని దివ్యాంగులకు ప్రభుత్వం రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచిన పింఛన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను ఎవరూ చిన్నచూపు చూడవద్దని సీఎం కేసీఆర్ వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, తిప్పర్తి ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీడీఓలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సేవకుల సదస్సును జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రామగిరి(నల్లగొండ): ఈ నెల 25న నల్లగొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో జరిగే జిల్లా సేవకుల సదస్సును జయప్రదం చేయాలని నల్లగొండ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. బుధవారం క్లాక్ టవర్ వద్ద గల సెంటినరీ బాప్టిస్టు చర్చిలో సదస్సు పోస్టర్ల ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదస్సుకు రెవరెండ్ వై.మోహన్‌బాబు, దీవెనకుమార్, జాన్‌సామ్యూల్, సామ్యూల్ సాజన్ హాజరై సందేశాలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ రెవరెండ్ డేవిడ్ రాజు, రవికుమార్, ప్రదీప్ సామ్యూల్, ఎషమా, ఎస్‌కే.జాన్ బాబు, ఎస్పీ జయప్రకాష్, పీజే.జేమ్స్, జేపీ.ప్రభుచరణ్, జేడీ పాల్, సీహెచ్. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తులు

నల్లగొండ: సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక అవార్డుల అందజేతకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా టూరిజం శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 21 రకాల పర్యాటక సంబంధ విభాగాల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ టూరిజం అవార్డు కింద సంబంధిత విభాగాలకు చెందిన దరఖాస్తులు ఈ నెల 31లోగా రవీంద్ర భారతి, సైఫాబాద్, హైదరాబాద్‌లోని పర్యాటక శాఖ కార్యాలయంలో స్వయంగా గానీ, పోస్ట్ ద్వారా గాని అందజేయాల్సిందిగా సూచించారు. ఇతర వివరాలకు సెల్ : 94408160650, 9440816068 నంబర్లను సంప్రదించాలని కోరారు.

• 'చంద్రయాన్' విజయోత్సాహం



నిడమనూరు మోడల్ స్కూల్‌లో బుధవారం సాయంత్రం చంద్రయాన్-3 ల్యాండింగ్ దృశ్యాన్ని టీవీలో వీక్షిస్తున్న విద్యార్థినులు



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో సంబరాలు జరుపుకుంటున్న గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామస్తులు

అసంతృప్తి జ్వాల

- సిట్టింగులకే సీట్లను కేటాయించడాన్ని నిరసిస్తూ రాజీనామాలు
- బీఆర్‌ఎస్‌కు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వీరేశం రాం..రాం..
- ప్రజలు కోరుకున్న పార్టీ నుంచే పోటీ చేస్తానని ప్రకటన
- నల్లగొండలో ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానన్న పిల్లి రామరాజు
- దేవరకొండ, సాగర్, కోదాడలో అభ్యర్థులను మార్చాలని డిమాండ్
- ఆలేరులో అలకబూనిన మోత్కుపల్లి నర్సింహులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : బీఆర్‌ఎస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ సిట్టింగులకే టికెట్లు కేటాయించడాన్ని నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో అసంతృప్తులు బయటకు వచ్చారు. నకిరేకల్, నల్లగొండ, నాగార్జునసాగర్, కోదాడ, దేవరకొండలో అసంతృప్తులు ఆందోళనకు దిగారు. సీఎం కేసీఆర్ అభ్యర్థుల జాబితాను ప్రకటించకముందు నుంచే దేవరకొండ, కోదాడ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమావేశాలు పెట్టి.. సిట్టింగ్‌లకు టికెట్లు ఇవ్వొద్దని తీర్మానాలు చేశారు. వారికి టికెట్లు ఇస్తే తాము సహకరించబోమని కూడా ప్రకటించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా ప్రకటన తరువాత నకిరేకల్, నల్లగొండ, నాగార్జునసాగర్‌లో అసంతృప్తులు భగ్గుమంటున్నారు.

మొదటి నుంచి అసంతృప్తే

పలు నియోజవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల పట్ల సొంత పార్టీకి చెందిన నియోజకవర్గ నేతలు మొదటి నుంచి అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దేవరకొండ, కోదాడ నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి మరీ వారికి టికెట్లు ఇవ్వొద్దని తీర్మానాలు చేశారు. ఇక టికెట్ల కేటాయింపు ప్రకటన తరువాత నాగార్జునసాగర్, నకిరేకల్, నల్లగొండలో ఆందోళనలు మొదలయ్యాయి. నాగార్జునసాగర్, నల్లగొండ, నకిరేకల్‌లో ఆశావహులు తమ కార్యక్రమాలను చేసుకుంటూ వెళ్లారు. తమకు అవకాశం ఇవ్వాలని కోరుతూ వచ్చారు తప్ప ఎక్కడ సిట్టింగ్‌లను మార్చాలంటూ ఆందోళనలు చేయలేదు.



నకిరేకల్‌లో తన అనుచరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం

రాజీనామా అస్త్రం

తనకు టికెట్ ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాదు ప్రజలు కోరుకున్న పార్టీ నుంచి పోటీ చేస్తానని స్పష్టం చేశారు. నకిరేకల్‌లో మొన్నటివరకు టికెట్ తనకు వస్తుందని ఆయన ఆశతో ఉన్నారు. ఆయనకు టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారుతారన్న ప్రచారం సాగింది. అయినా అధిష్టానం మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకే టికెట్ కేటాయించింది. దీంతో ఆందోళన పడిన వీరేశం వర్గం బుధవారం నకిరేకల్‌లో బల ప్రదర్శనకు దిగింది. వీరేశం తన అనుచరులతో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతోపాటు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, ఇతర ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.



నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి రామరాజు యాదవ్

స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానన్న రామరాజు

గత రెండేళ్లుగా ఆర్‌కేఎస్ ఫౌండేషన్ పేరుతో బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టణ మాజీ అధ్యక్షుడు, కౌన్సిలర్ పిల్లి రామరాజు యాదవ్ నల్లగొండ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసారి బీఆర్‌ఎస్ నుంచి తనకు టికెట్ వస్తుందని ఆశించారు. అయితే, అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికే టికెట్‌ను కేటాయించింది. దీంతో బుధవారం రామరాజు తన అనుచరులు, అభిమానులతో సమావేశం నిర్వహించి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు.



గుర్రంపోడు మండలం కొప్పోలులో సాగర్ నియోజకవర్గ అసమ్మతి నేతల సమావేశం



కోదాడలో అసమ్మతి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి

అభ్యర్థిని మార్చకపోతే రాజీనామానే..

కోదాడ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌పై నియోజకవర్గానికి చెందిన సొంత పార్టీ నేతలు కన్మంతరెడ్డి శశిధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు తదితరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థిని మార్చాలని సమావేశాలు పెట్టి మరీ తీర్మానించారు. అయినా, అధిష్టానం మల్లయ్యనే అభ్యర్థిగా ఖరారు చేయడంతో కోదాడలో బుధవారం అసమ్మతి నేతలు సమావేశం నిర్వహించారు. మల్లయ్య యాదవ్ అభ్యర్థిత్వాన్ని మార్చకపోతే తాము పార్టీకి రాజీనామా చేస్తామని ప్రకటించారు.

- దేవరకొండలో అభ్యర్థిని మార్చాలని గతంలోనే పార్టీ నేతలు సమావేశాలు పెట్టి తీర్మానాలు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకు కాకుండా మాజీ మున్సిపల్ చైర్మన్ దేవేందర్‌నాయక్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం కూడా దేవరకొండలో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు.
- నాగార్జునసాగర్‌లో నోముల భగత్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం కడారి అంజయ్య యాదవ్ తన అనుచరులతో సమావేశం నిర్వహించారు. త్వరలోనే తన కార్యాచరణను ప్రకటిస్తానని పేర్కొన్నారు. బుధవారం గుర్రంపోడు మండలం కొప్పోలులో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గాలి రవికుమార్ ఆధ్వర్యంలో సమావేశమై అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు.
- ఆలేరులో తనకు టికెట్ ఇవ్వాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు గురువారం యాదగిరిగుట్టలో తన అనుచరులతో సమావేశం నిర్వహించబోతున్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధతీసుకోవాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ: మహిళలు తమ ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని, తద్వారా రక్తహీనత సమస్య తలెత్తదని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో యూనిసెఫ్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మహిళా సర్పంచ్‌లు, కేజీబీవీ స్పెషల్, మెడికల్ ఆఫీసర్లకు అనిమియా, బాల్యవివాహాల నివారణ, సామాజిక వ్యక్తిగత మార్పు అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కేంద్రాల్లో ఉచితంగా వివిధ రకాల పరీక్షలు నిర్వహిన్నామని పేర్కొన్నారు. యూనిసెఫ్ అధికారి బీవీ.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళల్లో 12 శాతానికి మించి హిమోగ్లోబిన్ ఉండాలనే లక్ష్యంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, డీఈఓ భిక్షపతి, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సంస్థ కోఆర్డినేటర్లు విద్యులత, పి.కృష్ణ, బాలల సంక్షేమ సమితి చైర్మన్ చింత కృష్ణ, డీఆర్‌డీఓ, వైద్యశాఖ సిబ్బంది, సర్పంచ్‌లు, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

జీఓ నంబర్లు 58, 59 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో నివాస స్థలాలను క్రమబద్ధీకరించేందుకు వచ్చిన పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి అర్హులైన వారికి పట్టాలు జారీ చేయాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. జీఓ 58, 59, ధరణి, గృహలక్ష్మి దరఖాస్తుల వెరిఫికేషన్ తదితర అంశాలపై బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజావాణిలో రెవెన్యూ శాఖ సంబంధించి పెండింగ్ అర్జీలు పరిష్కరించాలన్నారు.

నిబంధనలు పక్కాగా పాటించాలి

రానున్న ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ వ్యవహారంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా పాటించాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. రానున్న ఎన్నికల దృష్టిలో ఉంచుకొని ఎన్నికల వ్యయం అధికంగా జరిగే అవకాశం ఉన్న సున్నిత ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పీ, ఇన్‌కం టాక్స్, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ, ఎల్‌డీఎం ఇతర అధికారులతో పలు విషయాలపై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు ఎన్నికల్లో, ఎన్నికల ముందు చేసిన వ్యయం అంశాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎన్నికల కమిషన్ సూచించిన స్టాండర్డ్స్ ఆపరేషన్ ప్రక్రియను అనుసరించి రానున్న ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎక్సైజ్ సూపరిటెండెంట్ సంతోష్, ఎల్‌డీఎం శ్రామిక్ తదితరులు పాల్గొన్నారు.

• విన్నింగ్ షాట్



ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీకి పెద్ద దిక్కుగా, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేలందరినీ గెలిపించే బాధ్యత భుజాన వేసుకున్న విద్యుత్ శాఖ మంత్రిగుంటకండ్ల జగదీష్‌రెడ్డి బుధవారం సూర్యాపేటలో ఎస్‌జీఎం క్రికెట్ గ్రౌండ్‌ను, అకాడమీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. భారీ షాట్లు కొట్టి అలరించారు.
- సూర్యాపేట టౌన్

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి

నల్లగొండ టౌన్: ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనంగా నెలకు రూ.18వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చినపాక లక్ష్మీనారాయణ, తుమ్మల వీరారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ ఆఫీస్ వరకు భారీ ప్రదర్శనగా వచ్చి డీఎంహెచ్ కొండలరావుకు వినతిపత్రం ఇచ్చారు. ప్రదర్శన అనంతరం ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు పద్మ, తవిటి వెంకటమ్మ, పీఎస్ఎం జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, పెంజర్ల సైదులు, పోలె సత్యనారాయణ, బైరం దయానంద్, ఆశాలు జయమ్మ, ధనలక్ష్మి, ఇందిర, కళావతి, మణెమ్మ, పార్వతమ్మ, జ్యోతి, వసంత, స్వర్ణ, విగ్నేశ్వరి, నవనీత, సైదమ్మ మంజుల, విజయ, రమాదేవి, సుజాత, నాగమణి, ప్రేమలత పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

నల్లగొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీజీ, డాక్టర్ కోర్సులు చదువుతూ ఉపకార వేతనం పొందుటకు అర్హత గల మైనారిటీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి టి.విజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్, న్యూజిలాండ్ దేశాలలోని విశ్వవిద్యాలయాల్లో స్ప్రింగ్ సీజన్ 2023లో అడ్మిషన్ పొందిన వారు అర్హులని పేర్కొన్నారు.. ఆసక్తిగల మైనారిటీ విద్యార్థులు www.telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 22 నుంచి సెప్టెంబర్ 21 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. హార్డ్ కాపీలు కార్యాలయంలో సమర్పించడానికి సెప్టెంబర్ 22 చివరి తేదీ అని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని..



కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతున్న రెండో ఏఎన్‌ఎంలు

నల్లగొండ టౌన్: తమను రెగ్యులరైజేషన్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రెండో ఏఎన్‌ఎంలు నల్లగొండ కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె బుధవారం ఎనిమిదో రోజుకు చేరింది. తమ డిమాండ్‌ను నెరవేర్చాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. తమను రెగ్యులరైజ్ చేసేంత వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రెండో ఏఎన్‌ఎంలు రత్నకుమారి, నర్సమ్మ, నాగమణి, వసంత, సుశీల, గీతారాణి, నీలవేణి, సుచిత్ర, శకుంతల, ఇందిరా, జ్యోతి, శారద, పుష్ప, విజయలక్ష్మి, రజిత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు;

బీఆర్‌ఎస్‌ను పాతరేయడం ఖాయం

- బీజేపీ నాయకుల వ్యాఖ్య
- నల్లగొండలో ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి ప్రయత్నం
- అడ్డుకున్న పోలీసులు.. పలువురి అరెస్ట్

నల్లగొండ టూటౌన్: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనకు ప్రజలు పాతర వేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర నాయకురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ నాయకులు వేర్వేరుగా నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించారు. హైదరాబాద్ రోడ్డులో ర్యాలీగా బయలు దేరిన బీజేపీ నాయకులను అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. దీంతో కన్మంతరెడ్డి, రావెళ్ల కాశమ్మ, ఐతరాజు సిద్దుకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, మహిళా కార్యకర్తలు, ఇతర నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసినవారిని వ్యక్తిగత పూచీకత్తుపై మధ్యాహ్నం తరువాత వదిలేశారు. అంతకు ముందు వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అమలు చేయడంతో విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, కంకణాల నాగిరెడ్డి, గుర్రం వెంకన్న, సాయి, పాలకూరి రవిగౌడ్, ఏరుకొండ హరి, రాఖీ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో బీజేపీ నాయకుల వాగ్వాదం



కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్ గెస్ట్ లెక్చరర్లుగా పని చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన విద్యాలయాల సంస్థ నల్లగొండ రీజియన్ అధికారి కె.లక్ష్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ 03, ఫిజిక్స్ 03, కెమిస్ట్రీ ఒకటి, పీజీటీ ఇంగ్లిష్ 03, మ్యాథ్స్ ఒకటి, ఫిజికల్ సైన్స్ ఒకటి, ఫిజికల్ డైరెక్టర్ రెండు పోస్టుల చొప్పున ఖాళీలు ఉన్నట్లు వివరించారు. ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26న సాయంత్రం 5గంటల వరకు నల్లగొండ గిరిజన విద్యాలయాల సంస్థ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లతో సమర్పించాలని సూచించారు. ఈ నెల 28వ తేదీన కార్యాలయంలోనే డెమో, ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈఅవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

B.Sc (Nursing) అడ్మిషన్లకై సంప్రదించండి
నల్లగొండ / Hyderabad నందు B.Sc. Nursing కోర్సులో చేరదలచిన వారు సంప్రదించండి.
SRI BHAVANA COLLEGE OF NURSING
Nalgonda Town. Cell: 98481 05500 / 96529 09766

క్లుప్తంగా

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండమల్లేపల్లి : దేవరకొండ మండలంలోని మైనంపల్లి వాగు నుంచి కొండమల్లేపల్లికి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.ఇసుక రవాణాపై సమాచారం మేరకు సాగర్ రోడ్డులోని జేబీకాలనీలో బుధవారం మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

భువనగిరి : ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెబుల్ టెన్నిస్ విభాగంలో చింతమల్ల స్వర్ణలత(చిన్నకందుకూరు), షెటిల్ బాడ్మింటన్ విభాగంలో లకుమాల వెంకన్న (భువనగిరి), చెస్ క్రీడలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (మోటకొండూరు), డిస్కస్ త్రో విభాగంలో గోనూరు శ్రీనివాస్(భువనగిరి), లాంగ్ జంప్ పోటీలలో దోర్ల విజయ(బద్దునాయక్ తండా),పవర్ లిఫ్టింగ్ విభాగంలో గుగులోతు శిరీష(కర్మలగడ్డ తండా) ఉన్నారు.

ఎన్జీ కళాశాలలో నాణ్యమైన విద్య

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్ తెలిపారు. పీజీ సెట్–2023 ఫలితాల్లో వివిధ సబ్జెక్టుల్లో స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో అర్హత కలిగిన అధ్యాపకులతో అత్యుత్తమ బోధన అందిస్తున్నామన్నారు. పీజీ సెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించి ఎన్జీ కళాశాల ఖ్యాతిని నిలబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ వి.శ్రీనివాస్, లైబ్రేరియన్ ఏ.దుర్గాప్రసాద్, ఎస్.శ్రీనాథ్‌పటేల్, డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి, చంద్రయ్య, దుర్గాప్రసాద్, నర్సింహ పాల్గొన్నారు.

‘రియల్’ పేరిట ఘరానా మోసం !

- తక్కువ పెట్టుబడితో రెట్టింపు లాభాలంటూ ఎర
- పెట్టుబడిదారులను తీసుకొస్తే ఏజెంట్లకు 30శాతం కమీషన్ ఇచ్చేలా ఒప్పందం
- 144మంది బాధితుల నుంచి రూ.4.50కోట్లు వసూలు
- బాధితుల ఫిర్యాదుతో ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.1.36కోట్లు స్వాధీనం



మీడియాకు నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ అపూర్వారావు, చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు

నల్లగొండ క్రైం : రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలంటూ ఘరానా మోసానికి పాల్పడిన ఓ ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.36కోట్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అపూర్వరావు నిందితుల వివరాలు, మోసగించిన తీరును వివరించారు. హైదరాబాద్‌లోని సాగర్‌రోడ్డులో గల ఓంకార్ నగర్‌కు చెందిన రియల్‌ఎస్టేట్ బ్రోకర్, ఫిలిమ్ ప్రొడ్యూసర్‌గా పనిచేసే మామిళ్ల గిరి ప్రసాద్, నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం బట్లపల్లి గ్రామానికి చెందిన మాదగోని వెంకటేశ్, రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నానక్‌నగర్ గ్రామానికి చెందిన బర్ల శేఖర్‌యాదవ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వీరు కొంతకాలం క్రితం ఓ ముఠాగా ఏర్పడి అందమైన బ్రోచర్లను తయారు చేయించి, కాగితాలపై ఎకరాల కొద్దీ ఉన్నట్లు వెంచర్ల ఫొటోలతో పాటు కార్పొరేట్‌స్థాయిలో కార్యాలయం ఏర్పాటు చేయించారు. సింగిల్ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టండి.. ఏడాదిలోనే రెట్టింపు ఆదాయం లభిస్తుందంటూ నమ్మబలుకుతూ ముఠా సభ్యులు ప్రచారం చేశారు.

రూ.10లక్షలు పెడితే ఏడాదికి రూ.20లక్షలు అంటూ..

ప్లాట్ల కొనుగోలుకు మధ్యవర్తిగా తీసుకొచ్చే ఏజెంట్లకు 30శాతం కమిషన్ ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. గిరిప్రసాద్ స్నేహితుడైన బైరమాల్‌గూడ పిండి నారాయణరెడ్డి కాలనీకి చెందిన బొడ్డు వెంకటేశ్ ద్వారా కొన్ని ప్లాట్లు విక్రయించారు. ఏడాది క్రితం వీరు బైరమాల్‌గూడలో గోల్డెన్ ఈగల్ ఇన్ఫ్రా డెవెలపర్స్ పేరుతో బోగస్ రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రారంభించారు. సువర్ణ అవకాశం అంటూ రూ.10లక్షలు పెట్టి ఒక ప్లాట్ కొనండి ఏడాది తర్వాత రూ.20లక్షలు పొందండి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కొద్ది రోజుల తర్వాత అక్కడి నుంచి ఓంకార్‌నగర్‌కు మకాం మార్చి అక్కడ అద్దెకు తీసుకొని కార్పొరేట్ స్థాయిలో గౌతమ్స్ ఈగల్ ఇన్ఫ్రా డెవెలపర్స్ పేరుతో కార్యాలయం ప్రాంభించారు. ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు నానక్‌నగర్‌కు చెందిన బర్ల శేఖర్‌ను ఉద్యోగిగా నియమించుకున్నారు. కస్టమర్ నుంచి వచ్చే డబ్బులో కొంత కమిషన్ ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఆఫీస్ వ్యవహారాలన్నీ బొడ్డు వెంకటేష్, బర్ల శేఖర్ చక్కబెట్టారు. ప్రజలను నమ్మించేందుకు ముందుగానే ప్లాట్ అగ్రిమెంట్ కాగితాలతోపాటు పోస్టు డేట్ చెక్కులను కస్టమర్లకు ఇచ్చారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో ఓంకార్‌నగర్‌కు చెందిన గిరిప్రసాద్ పేరుతో పాటు సదరు కంపెనీ పేరుపై భూమి ఉన్నట్లు వెంచర్ లే అవుట్ కాపీలను తయారు చేయించి మోసగించారు.

ఏజెంట్ల ద్వారా రూ.4.50 కోట్లు..

ఈ ముఠా సభ్యులు నియమించుకున్న పలువురు ఏజెంట్లు మర్రిగూడకు చెందిన సుధాకర్, చెరుకు శ్రీరాములు, బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన పచ్చిపాల గణేష్, సురిగి రమేష్‌తో పాటు మరికొందరి ద్వారా బాధితుల నుంచి మొత్తంగా రూ.4.50కోట్లు వసూలు చేశారు. ఆ డబ్బులో 30 శాతం ఏజెంట్ల కమిషన్ పోగా 40శాతం డబ్బుతో జల్సాలు, సినిమా షూటింగ్ కోసం ఈ ముఠా ఖర్చు చేసింది. కస్టమర్లు డబ్బు కావాలని నిలదీస్తే ఇచ్చేందుకు కార్యాలయంలో సిద్ధంగా ఉంచుకున్నారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోకుండా ఉండేందుకు గత ఆగస్టు 6న అన్నపూర్ణ స్టూడియోలో గౌతమ్‌ఈగల్ ఇన్ఫ్రా డెవెలపర్స్ ప్రొడక్షన్ నంబర్ వన్ పేరిట సినిమా షూటింగ్ ప్రారంభించారు. వీరిపై అనుమానంతో కొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ముఠాను అరెస్ట్ చేసి, వారి వద్ద రూ.1.36కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. బాధితులు ఒత్తిడి చేస్తే ఐపీ పెట్టి పారిపోయేందుకు కూడా ఈ ముఠా నిర్ణయించుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

భార్య మరొకరితో సఖ్యతగా మెలుగుతోందని..

- మనస్తాపంతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సిద్దయ్య మృతదేహం

మఠంపల్లి : భార్య మరొకరితో సఖ్యతగా మెలుగుతోందని మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రఘునాథపాలెం గ్రామానికి చెందిన ముత్యాలంపాటి సిద్దయ్య(36)కు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన హసీనాతో 14ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. సిద్దయ్య వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా హసీనా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో సఖ్యతగా మెలుగుతోందని సిద్దయ్య అనుమానించాడు. ఇదే విషయంపై పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. అయినా, హసినా తీరులో మార్పు రావడం లేదని కొద్ది రోజుల క్రితం ఇంట్లో మళ్లీ గొడవ జరిగింది. దీంతో హసీనా ఇద్దరు కుమారులను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. సిద్దయ్య ఇద్దరు కుమారులు పక్కనే ఉంటున్న చిన్నాన్న ఇంట్లో ఉంటున్నారు. ఎన్ని సార్లు నచ్చచెప్పినా భార్య తీరులో మార్పు రాలేదని మనస్తాపంతో సిద్దయ్య తెల్లవారుజామున ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత సిద్దయ్య సోదరుడి కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొమ్ములతో పొడిచి.. ఆలయం వద్దకు ఈడ్చుకెళ్లి..

- వృద్ధుడిని పొట్టనబెట్టుకున్న దున్నపోతు
- నల్లగొండ మడలం అన్నెపర్తిలో విషాదం



యాదయ్య (ఫైల్)



యాదయ్యను పొడిచి చంపిన దున్నపోతు ఇదే

నల్లగొండ క్రైం : పత్తి చేనులో కలుపుతీస్తున్న ఓ వృద్ధుడిని దున్నపోతు కొమ్ములతో పొడిచి.. ఆపై సమీపంలోని గ్రామ దేవత ఆలయం వద్దకు ఈడ్చుకెళ్లి ప్రాణాలు తీసింది. ఈ విషాదకర ఘటన నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నకిరేకంటి యాదయ్య (60)కు అన్నెపర్తి గ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. బుధవారం యాదయ్య తన భార్య రాములమ్మతో కలసి పత్తిచేనులో కలుపు తీస్తున్నారు. ఈ క్రమంలో గ్రామదేవతకు విడిచిపెట్టిన దున్నపోతు పత్తి చేనులోకి వచ్చి మేసింది. యాదయ్య దున్నపోతును కర్రతో బెదిరించి పంపించాడు. దూరంగా వెళ్లినట్టే వెళ్లిన దున్నపోతు ఒక్కసారిగా తిరిగి వచ్చి కలుపు తీస్తున్న యాదయ్యను తీవ్రంగా పొడిచింది. పక్కనే ఉన్న రాములమ్మ ఎవరైనా వచ్చి కాపాడాలంటూ బిగ్గరగా అరుస్తూ పక్కనే ఉన్న బెటాలియన్ పోలీసులను పిలిచింది. పక్కనే ఉన్న రైతులు వచ్చినప్పటికీ దున్నపోతు యాదయ్యను వదిలిపెట్టకుండా కిలోమీటర్ దూరంలో ఉన్న మైసమ్మ గుడి వద్దకు ఈడ్చుకెళ్లింది. గ్రామస్తులు ఎంతమంది వచ్చినా యాదయ్యను వదిలిపెట్టలేదు. అదే గ్రామానికి చెందిన దున్నపోతును విక్రయించిన రైతు కొమ్మనబోయిన యాదయ్య వ్యక్తి వచ్చి దున్నపోతు చిక్కంకు కట్టిన తాడును గొడ్డలితో తెంపాడు. అనంతరం దున్నపోతున్న ఆలయం వద్ద కట్టేశారు. గాయపడిన యాదయ్యను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్‌ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా గ్రామ దేవత పేరిట విడిచిన దున్నపోతును తిట్టినా.. కర్రతో కొట్టినా... వాళ్లింటి గడప వద్ద రాత్రంతా నిద్రపోతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. క్షమించమని కోరిన తర్వాతే అక్కడి నుంచి వెళ్తుందని చెప్పారు. మృతుడి కుటుంబానికి ఎంపీటీసీ సైదులు గౌడ్, సర్పంచ్ అరవిందరెడ్డి రూ.లక్ష ఆర్థికసాయం చేశారు.

వేధింపుల కేసులో నలుగురికి రెండేళ్ల జైలు

భువనగిరి : వరకట్నం వేధింపుల కేసులో నలుగురికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ భువనగిరి ప్రిన్సిపల్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్‌కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం కొత్త గుండ్లపల్లికి చెందిన దివ్యకు హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లోని శ్రీనివాస్‌పుర్‌కు చెందిన వేముల శ్రీకాంత్‌తో 2018లో వివాహం జరిగింది. వరకట్నం కింద రూ. 6.50 లక్షల నగదు, 25 తులాల బంగారంతో ఇతర సామగ్రి, నాలుగు ఇళ్ల స్థలాలను దివ్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. రెండు నెలల తర్వాత ప్లాట్లను తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో పాటు అదనంగా కట్నం తీసుకరావాలని భర్త శ్రీకాంత్, అత్తమామలు విజయలక్ష్మి, రవికుమార్, మరిది సందీప్‌లు దివ్యను వేధించారు. అదనపు కట్నం తీసుకరావాలని ఇంటినుంచి పంపించారు. పెద్దల మధ్య పంచాయితీ పెట్టి ఇద్దరికి సర్ది చెప్పి తిరిగి అత్తగారి ఇంటికి పంపించారు. అనంతరం ఆమె గర్భం దాల్చింది. అయినప్పటికీ ఆమెకు సరైన ఆహారం అందించకుండా వేధించి ఇంటి నుంచి గెంటివేశారు. తిరిగి ఇంటికి వస్తే చంపేస్తామని బెదిరించారు. దీంతో దివ్య 2019 మే 20న భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో అభియోగపత్రాలను దాఖలు చేశారు. బుధవారం కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువకావడంతో నలుగురికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి నాగేశ్వర్ రావు తీర్పు వెల్లడించారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను ఏసీపీ వెంకట్‌రెడ్డి అభినందించారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి : సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ సర్కార్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. దివ్యాంగులకు పెంచిన ఆసరా పింఛన్ ఉత్తర్వు పత్రాలను బుధవారం భువనగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పింఛన్‌ను రూ.3016 నుంచి రూ.4016కు పెంచడం సంతోషకరమైన విషయమన్నారు. స్వరాష్ట్రంలో మండలాలు, జిల్లా కేంద్రాలకు రోడ్డు సౌకర్యం సమకూరిందని, నూతన జిల్లాలు సైతం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తున్నాయన్నారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 13,442 మంది దివ్యాంగులు ఆసరా పింఛన్ పొందుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, ఎంపీపీలు సుధాకర్, ప్రభాకర్‌రెడ్డి, రమేష్, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ గోళి ప్రణీత, కోట పుష్పలత పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల త్యాగం వృథా కాదని, వారి ఆశయ సాధనకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. కోదాడలోని రామ్మూర్తినగర్ వద్ద విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మలిదశ తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్బండ వర్గాల అభివృద్ధి దిశగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, నాగేంద్రాచారి, సుంకర అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

భువనగిరి : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు యాదాద్రి జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ఆధ్వర్యంలో 300 పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అర్హత, అసక్తి కలిగిన యువతీయువకులు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో హాజరుకావాలని తెలిపారు.

మోతెలో విషాదం



వెంకటాచారి (ఫైల్)

మోతె : ప్రభుత్వ ఉపాధ్యాయుడు (పీఈటీ) బైరోజు వెంకటాచారి ఖమ్మం జిల్లాలో దారుణ హత్యకు గురికావడంతో ఆయన స్వగ్రామం మోతె మండల కేంద్రంలో విషాదం అలుముకుంది. మండల కేంద్రానికి చెందిన .వెంకటాచారి నడిగూడెం మండలం సిరిపురం ఉన్నత పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్నారు. 25 సంవత్సరాల క్రితం ఈయన కుటుంబం నాయకన్‌గూడెం గ్రామానికి వలస వెళ్లింది. వెంకటాచారి గతంలో కబడ్డీ ప్లేయర్‌గా సుపరిచితుడు. మోతె గ్రామస్తులు వెంకటాచారితో గల అనుబంధాన్ని గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. వెంకటాచారి మృతదేహాన్ని కడసారి చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో నాయకన్‌గూడెం చేరుకున్నారు. వెంకటాచారి మృతదేహం పడి తండ్రి బోరున విలపిస్తుంటే గ్రామస్తులు కన్నీరు పెట్టారు.వెంకటాచారికి భార్య ,కొడుకు ఉన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

భువనగిరిటౌన్ : మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ వంగూరి రాములు మాట్లాడుతూ మిషన్ భగీరథ లో పనిచేస్తున్న కార్మికులకు పాత పద్ధతిలో ప్రాజెక్టులలో పనిచేసే వారికి రూ.10 వేల లోపు మాత్రమే ఇస్తున్నారన్నారు. జీఓ నం. 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిరుమల శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, ఉపాధ్యక్షుడు ఉగ్గి బాలరాజ్, కుమారస్వామి, ప్రసాద్ ,రమేష్ ,కృష్ణ , సంపత్ కుమార్,మహేష్ , యాదగిరి, కర్ణకార్, అశోక్, ప్రదీప్, మహేందర్, రవి, సత్యనారాయణ, ప్రశాంత్, జంగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషిచేయాలి



మాట్లాడుతున్న మహారాష్ట్ర ఎమ్మెల్సీ

మఠంపల్లి : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీని గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని మహారాష్ట్ర ఎమ్మెల్సీ నీల్యానాయక్ కోరారు. బీజేపీ చేపట్టిన ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా బుధవారం మండలంలోని మట్టపల్లిలో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దుండిగాల ఎల్లయ్య, మురళి, కోటేశ్వరరావు, వీరారెడ్డి, ఈదయ్య, రంగానాయక్, గోపాల్, మందా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



గుర్వయ్య మృతదేహం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలో చోటు చేసుకుంది. నెమ్మికల్ గ్రామానికి చెందిన వేల్పుల గుర్వయ్య (40) వ్యవసాయంతో పాటు కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసగా మారిన గుర్వయ్యకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మనస్తాపం చెంది. మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య ఇరుగుపొరుగు సాయంతో 108లో సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి 10గంటల సమయంలో మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

వలిగొండ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం బుధవారం వలిగొండలోని దోనూరి ప్రతాపరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. ఆసరా పింఛన్లు, ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, గృహలక్ష్మి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి మరెన్నో పథకాలను విజయవంతంగా అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వృద్ధులకు పింఛన్ ఇవ్వడానికే ఇబ్బంది పడుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తూ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాయని, ఆ పార్టీ నాయకులకు ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. భువనగిరి, నకిరేకల్ ఎమ్మెల్యేలు నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవ చేస్తున్నారని, వారిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారులకు కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని, అందులో భాగంగానే పైళ్ల రాజవర్ధన్‌రెడ్డికి మార్కెట్ చైర్మన్ పదవి ఇచ్చారని మంత్రి పేర్కొన్నారు. రాజవర్ధన్‌రెడ్డికి సీఎం కేసీఆర్‌తో మంచి అనుబంధం ఉందని, తెలంగాణ ఉద్యమంలో ఇద్దరు కలిసి పని చేశారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ఇంకా మంచి అవకాశం దక్కుతుందన్నారు.

మెరుగైన సేవలందించాలి

రైతులకు మెరుగైన సేవలు అందజేయాలని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య నూతన పాలకవర్గానికి సూచించారు. రైతులు, వ్యాపారులతో సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, వలిగొండ, రామన్నపేట ఎంపీపీలు నూతి రమేష్, జ్యోతి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాలనరసింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, సర్పంచ్ బొల్ల లలితాశ్రీనివాస్, ఎంపీటీసీలు పలుసం రమేష్, కుందారపు యశోద, పల్లెల భాగ్యమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు సుర్కంటి వెంకట్‌రెడ్డి, చిట్టెడి వెంకట్‌రాంరెడ్డి, చిట్టెడు జనార్దన్‌రెడ్డి, గూడూరు శివశాంత్ రెడ్డి, గూడూరు శ్రీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి, సత్తిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టికెట్ ఇవ్వకుండా అవమానించారు

- ప్రజలు కోరుకున్న పార్టీలో చేరుతా
- నకిరేకల్ బరిలో ఉంటా
- మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం



అనుచరులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్: బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం తనకు న్యాయం చేయలేదని, ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా అవమానించిందని నల్లగొండ జిల్లా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకుడు వేముల వీరేశం అన్నారు. ఈరోజు నుంచి ఆ పార్టీని వీడుతున్నానని ఆయన చెప్పారు. నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకు వారు కోరుకున్న పార్టీలో చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉండి గెలిచి తీరుతానని స్పష్టం చేశారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం తన అనచరులు, అభిమానులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తన రాజీనామాను ప్రకటించారు. ఈ సందర్భంగా భారీ జనసందోహాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ‘దోపిడీ, పీడన నుంచి పుట్టి సమానత్వం కోసం కొట్లాడి గాయపడ్డ మనిషిగా మాట్లాడుతున్న. ఈ నాలుగున్నరేళ్ల ఎగిసిపడ్డ దుఃఖాన్ని గుండెల్లో దాచిపెట్టుకున్నా.. ఇది నా ఒక్కని బాధ కాదు.. బీఆర్‌ఎస్ జెండాను పట్టిన ప్రతి ఒక్కరి బాధ. నాకు ఓట్లు వేసిన 86 వేల మంది ఆవేదన. పుట్టెడు దుఃఖం భరిస్తూ ముందుకు సాగాను. ఏ ఒక్క రోజూ పార్టీ మీద నిందలు వేయలేదు. నాకు ఎందుకు అన్యాయం చేశారు’ అని ఆయన ప్రశ్నించారు. ఉద్యమ కాలంలో జైలు జీవితం కూడా గడిపానన్నారు. గతంలో పీడిత ప్రజల కోసం విప్లవ పోరుబాట పట్టానని, ఆ బాట విడిచి ప్రజాసేవ చేయడం కోసమే ఉద్యమ పార్టీ అయిన బీఆర్‌ఎస్‌లోకి వచ్చానని చెప్పారు. జనమే తన సంపద అని, తాను బతికి ఉన్నంత కాలం ప్రజల కోసమే జీవిస్తూ వారిసేవలో ఉంటానని చెప్పారు. బీఆర్‌ఎస్‌ను వీడుతున్నాను. నాకిక ఎవరూ హైకమాండ్ లేరు.. ప్రజలే నాకు న్యాయనిర్ణేతలు.. మీ అభీష్టం మేరకు త్వరలోనే మీరు కోరుకున్న పార్టీలో చేరతా అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూజర్ల శంభయ్య, వంటిపాక యేసురత్నం, శేరి ఛత్రపతి, దూదిమెట్ల సత్తయ్య, సకినాల రవి, మాద యాదగిరి, గాదగోని కొండయ్య, నకిరేకంటి నరేందర్, పూస బాలకృష్ణ, కాటం వెంకటేష్, బెజవాడ సైదులు, వీరార్జున్‌రెడ్డి, బొజ్జ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో భారీ ప్రదర్శన

నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం సందర్భంగా ఆయన భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సమ్మేళనానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున తన అనచరులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. తొలుత నకిరేకల్‌లోని కనకదుర్గ ఆలయంలో పూజలు చేసి ర్యాలీ ప్రారంభించారు. సభావేదికపై వీరేశంతో పాటు టీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, వివిధ మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (APGVB) రీజనల్ ఆఫీస్, నల్లగొండ.

బంగారు ఆభరణాల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ తెలుపబడిన మా శాఖల యందు ఖాతాదారులు బంగారు ఆభరణములు తాకట్టు పెట్టి ఋణములు పొందియున్నారు. అట్టి ఋణం మొత్తం సకాలంలో చెల్లించవలసిందిగా నోటీసులు పంపియున్నాము. గడువులోగా ఋణం చెల్లించని కారణంగా తనఖా పెట్టిన బంగారు ఆభరణములను "ఎక్కడ ఎలాగ ఉన్నవి అలాగే" అనే ప్రాతిపదికపై ఈ క్రింద తెలియజేసిన శాఖలలో 1) ఎ.డి.పల్లి, త్రిపురారం శాఖలకు సంబంధించిన ఆభరణములను మిర్యాలగూడెం క్లస్టర్ బ్రాంచ్‌లో, 2) చెర్లపల్లి, ఇదులూరు శాఖలకు సంబంధించిన ఆభరణములను నల్గొండ మెయిన్ క్లస్టర్ బ్రాంచ్‌లో, 4) అంగడిపేట శాఖకు సంబంధించిన ఆభరణములను కె మల్లేపల్లి క్లస్టర్ బ్రాంచ్‌లో, 5) పి.యస్.ఆర్. సెంటర్, సూర్యాపేట శాఖకు సంబంధించిన ఆభరణములను పి.యస్.ఆర్.సెంటర్, సూర్యాపేట క్లస్టర్ బ్రాంచ్‌లో ది. 31-08-2023 (గురువారం) సా॥ 5-00 గం॥లకు వేలం నిర్వహించబడును.

క్రమ సంఖ్య	అకౌంట్ నెం.	ఋణగ్రహీత పేరు, తండ్రి / భర్త పేరు, చిరునామా	బరువు గ్రాములలో
		ఎ.డి.పల్లి శాఖ	
1.	73191030089	కటారు గురువమ్మ, భర్త : పాపయ్య, బల్నేపల్లి.	9.4
2.	73191112475	నేనావత్ హనిమి, భర్త : రాగ్యా, బాలాజీ తండా.	8.6
3.	73191594081	నక్కా కాశయ్య, తండ్రి: పెంటయ్య, చిట్యాల.	17.5
4.	73191601352	లావూరి రమేష్, తండ్రి: లక్పతి, గొన్యాతండా.	10.4
5.	73191659870	మిట్టగడపల ప్రకాష్, తండ్రి: సంజీవ, కాల్వకట్ట.	11.5
6.	73200101522	పులుసూరి ఆంజనేయులు, తండ్రి: మట్టయ్య, అడవిదేవులపల్లి.	22.8
7.	73201479219	మీరాబీ, భర్త: మీరావలి, ముదిమానిక్యం.	22.6
8.	73202322824	కోమటి సుధాకర్, తండ్రి: వెంకటేశ్వర్లు, అడవిదేవులపల్లి.	57.6
		దేవరకొండ శాఖ	
1.	73191393827	ముదావత్ తులసి, భర్త: రాజ్యా, కుందేలుబావి తండా.	11.29
		చెర్లపల్లి శాఖ	
1.	73199754152	వెంకటేశం యలిజాల, తండ్రి: బుగ్గయ్య, ఇ.నెం. 10-3, చెర్లపల్లి.	39.97
		త్రిపురారం శాఖ	
1.	73191453197	వడ్డెబోయిన సైదమ్మ, భర్త: నర్సయ్య, పెద్దదేవులపల్లి.	30.36
2.	73197736973	పదిశాల సత్యవతి, భర్త: సైదులు, త్రిపురారం.	27.5
		అంగడిపేట శాఖ	
1.	73203128928	మద్దిమడుగు సదానందం, తండ్రి: జానయ్య, ఇ.నెం.13-19, అక్కంపల్లి.	37.88
		పి.యస్.ఆర్.సెంటర్, సూర్యాపేట శాఖ	
1.	73207064402	దుదపల్లి భిక్షం, తండ్రి: పాపయ్య, ఇ.నెం. 1-8-43/4/1, బ్రిక్‌సాపోర్స్, సూర్యాపేట.	17.9
		ఇదులూరు శాఖ	
1.	73200875100	కన్నెబోయిన లింగస్వామి, తండ్రి: రాములు, మునుకుంట్ల, కట్టంగూరు.	51.6
2.	73201959568	జాల యాదయ్య, తండ్రి: వీరయ్య, 3-56, ఇదులూరు, కట్టంగూరు.	28.9

వేలం నియమ నిబంధనలు :

1) వేలం APGVB పైన తెలిపిన క్లస్టర్ శాఖలలో జరుపబడును. 2. వేలంలో పాల్గొనదలచినవారు రూ॥ 10,000/- సెక్యూరిటీ డిపాజిట్ చేయవలెను. 3. పోటీదారు డబ్బు మొత్తం వెంటనే చెల్లించి ఆభరణములు తీసుకొనవలెను. 4. ఆభరణములు వేలం సమయములో మాత్రమే తనిఖీ చేసుకొనవలెను. 5. సరియైన విలువ రానిచో లేదా ఏ కారణము లేకుండా వేలం రద్దు చేయుటకు బ్రాంచి మేనేజర్‌కు అధికారం కలదు. 6. పాడుకున్నవారు అదనంగా 3% జి.యస్.టి. చెల్లించవలెను. మిగతా వివరాలకు ఆయా శాఖల బ్రాంచి మేనేజర్‌ను సంప్రదించగలరు.

ఇట్లు – రీజనల్ మేనేజర్, APGVB రీజనల్ ఆఫీస్, నల్గొండ.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ పారామెడికల్ అడ్మిషన్లు ఇంటర్మీడియట్‌లో ఏదైన గ్రూప్‌లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థినీ / విద్యార్థులు అర్హులు. Courses: DMLT / DRGA / DMIT / DMPHA (M) Anasthesia ఆప్తాలమిక్ / డయాలసిస్ త్రివేణి పారామెడికల్ కళాశాల, నల్లగొండ. సంప్ర॥ సెల్ : 9652909766 / 9848105500 [YA-2710]

Wanted

■ నల్లగొండ పట్టణం రియల్‌మీ ఆఫీస్ నందు పని చేయుటకు ఇద్దరు ఉద్యోగులు కావలెను. కంప్యూటర్ పరిజ్ఞానం మరియు వెహికిల్ ఉన్న వారికి ప్రాధాన్యత. సంప్ర॥ 9949123431, 7093818026 [Y-798256]

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పని చేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, వార్డ్‌బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-12052]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్ : 9640258899, 9640468899 [HA-189323]

Services

■ శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214 [H-788623]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.